



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
నవంబరు 19, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


### మావోయిస్టు అగ్రనేత

# హిడ్మా ఎన్‌కౌంటర్

## ఆయన భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులు మృతి

- ఈ రోజు ఉదయం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తలపై రూ.6 కోట్ల రివార్డు
- హిడ్మా మృతిని ధృవీకరించిన ఏపీ డీజీపీ
- అమిత్ షా డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేసిన భద్రతా బలగాలు
- లొంగిపోవాలని చర్చలు జరిపిన 8 రోజులకే ఎన్‌కౌంటర్

**చత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నక్సల దళానికి కీలకమైన అగ్రనేత మేడ్వి హిడ్మా ఎదురుకాల్పుల్లో మట్టుబడ్డాడు. అనేక రక్తపాతం ఘటనలకు నేతృత్వం వహించిన ఈ నక్సల కమాండర్ హత కావడంతో ఎర్రదళాలకు పెద్ద దెబ్బ తగిలినట్లైంది. ఉదయం గంటలపాటు సాగిన ఆపరేషన్‌లో హిడ్మాతో పాటు అతని సహచరులూ నిర్వీర్యమయ్యారని భద్రతా వర్గాలు తెలిపాయి. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం కాగా, అటవీ ప్రాంతంలో నక్సల దళం బలహీనపడినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు. హిడ్మా మరణంతో గత దశాబ్దంగా భద్రతా దళాలపై వరుస దాడులకు దారి తీసిన శక్తి వలయం కూలిపోయిందని భావిస్తున్నారు.**





భద్రాద్రి కొత్తగూడెం: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈరోజు ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా మృతిచెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య రాజీ, మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల ఎదురు కాల్పుల్లో మరణించారు. ఈమేరకు హిడ్మా, రాజే మరణించిన విషయాన్ని పోలీసులు నిర్ధారిస్తూ వారి మృతదేహాల ఫొటోలను రిలీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలకు సంబంధించి కచ్చితమైన సమాచారంతో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ఈరోజు ఉదయం కూంబింగ్ చేపట్టాయని ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. చిన్న వయసులోనే మావో యిస్టు కేంద్ర కమిటీకి

(మిగతా 2వ పేజీలో)

## విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్

**::: ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా**



- కూలీల వేషంలో తలదాచుకున్న నక్సల్స్
- ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అగ్రనేతలు కూడా అరెస్ట్ అయిన వారిలో ఉన్నట్లు సమాచారం
- ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- పక్కా సమాచారంతోనే అరెస్టులు చేసినట్లు వెల్లడించిన ఇంటెలిజెన్స్ చీఫ్



### జల సంరక్షణలో

## తెలంగాణ టాప్

- నేషనల్ వాటర్ అవార్డ్-2024లో రాష్ట్రానికి జాతీయ గుర్తింపు
- జల్ సంచయ్-జన్ భాగీదారీలో దేశంలోనే అత్యధిక పనులు
- 3 జోన్లలో తెలంగాణ జిల్లాలకు విజయాలు

హైదరాబాద్: జల సంరక్షణ చర్యల్లో దేశవ్యాప్తంగా తెలంగాణ మరోసారి తన సామర్థ్యాన్ని నిరూపించింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ నేషనల్ వాటర్ అవార్డ్సు-2024, జల్ సంచయ్-జన్ భాగీదారీ పురస్కారాల్లో రాష్ట్రం అగ్రస్థానాన్ని సాధించింది. మొత్తం 5,20,362 జలసంరక్షణ పనులు పూర్తి చేసి దేశంలోనే అత్యుత్తమంగా నిలిచిన తెలంగాణకు అవార్డుల వరద కురిసింది. న్యూఢిల్లీలో జరిగిన పురస్కార కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా రాష్ట్ర ప్రతినిధులు అవార్డులు స్వీకరించారు. జల్ సంచయ్-జన్

(మిగతా 2వ పేజీలో)

iBOMMA

## ఐబొమ్మ రవి కేసులోకి ఈడీ

- మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో ద్వారా నిధుల సమీకరణ
- 3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు

### దేశానికి పెద్దన్నగా మోదీ సహకరిస్తే

## అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి: రేవంత్‌రెడ్డి



- తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్న సీఎం

దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల

(మిగతా 2వ పేజీలో)

## అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి



- మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
- అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులంటూ ఫైర్



ఏపీ బనకచర్ల యత్నాలు

## చట్టవిరుద్ధం

నిలువరించాలని తెలంగాణ విజ్ఞప్తి

ఆల్మట్టి ఎత్తు పెంపు వల్ల రాష్ట్రానికి తీవ్ర జలక్షామం

# మాజీ సర్పంచ్ చింతల భూపాల్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 18 : చౌటుప్పల్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి, సిపిఎం సీనియర్ నాయకులు, ఉమ్మడి నల్గొండ జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల భూపాల్ రెడ్డి మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని ఆయన నివాసానికి చేరుకుని భూపాల్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎం పార్టీ విస్తరణ కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు .పార్టీ నిర్మాణంలో కందాల రంగారెడ్డి వారసత్వాన్ని అందుకొని పార్టీపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను తిప్పుకొట్టడంలో చౌటుప్పల్ ప్రాంతంలో కీలకంగా పని చేశారని అన్నారు. సర్పంచ్ గా పనిచేస్తున్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోనే చౌటుప్పల పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్న వ్యక్తి భూపాల్ రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండడం ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించడం ఆయన దినచర్యగా ఉండేదని అన్నారు. పార్టీ లో పని చేసే యువ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడంలో వారిని ప్రోత్సహించడంలో ఆయనది ఒక ప్రత్యేకమైన స్థానమని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, మునుగోడు సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, బత్తుల విప్లవ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..

# ఏపీ బనకచర్ల యత్నాలు చట్టవిరుద్ధం

## నిలువరించాలని తెలంగాణ విజ్ఞప్తి.. ఆల్మట్టి ఎత్తు పెంపు వల్ల రాష్ట్రానికి తీవ్ర జలక్షామం



న్యూఢిల్లీ: గోదావరి వరద జలాలను మళ్లించే పేరుతో ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న పోల వరం-బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు పెద్ద ముప్పుగా మారుతోందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరోసారి కేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు ఏ రూపంలో వచ్చినా అది చట్టవిరుద్ధమని, నిలువరించాలని కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అనంతరం ఆయన స్పష్టం చేశారు. బచావత్ ట్రిబ్యునల్‌లో 'వరద జలాలు', 'మిగులు జలాలు' అనే వర్గీకరణలే లేని సందర్భంలో వరద నీటిని మళ్లించేందుకు ఏపీ ప్రయత్నించడం నిబంధనలకు విరుద్ధమని ఉత్తమ్ పేర్కొన్నారు. బనకచర్ల పీఎఫ్‌ఆర్‌పై తెలం గాణ, మహారాష్ట్ర, కర్ణాటక ఇప్పటికే అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు సాగుతోందని ఆయన కేంద్రానికి వివరించారు.ఈ ప్రాజెక్టు అమలు అయితే గోదావరి-కృష్ణా బేసిన్‌లలో ఎగువ రాష్ట్రాల నీటి వినియోగం పెరిగి దిగువ భాగమైన తెలంగాణకు చేరే ప్రవాహాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీ గత నెలలో డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానించిందని గుర్తు చేశారు. ఇదిలా ఉంటే, కర్ణాటక ఆల్మట్టి ఎత్తు పెంపు కోసం భూసేకరణ చేపట్టడం కూడా తెలంగాణకు మరో ప్రమాదకర సంకేతమని ఉత్తమ్ చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఎత్తు పెంపు జరిగితే దిగువన ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కొరత తప్పదని పేర్కొన్నారు. పాల మూరు-రంగారెడ్డి, సమ్మక్క సాగర్ వంటి రాష్ట్ర ప్రాజెక్టులకు అవసరమైన కేంద్ర అనుమతులు పొందడంలో జాప్యం జరుగుతోందని, కరువు ప్రాంతాల ప్రయోజనాల కోసం వీటిని వేగవంతం చేయాలని మంత్రి పాటిల్‌ను అభ్యర్థించారు. కృష్ణా జలాలపై కేడబ్ల్యూడీటీ-2 విచారణను త్వరగా పూర్తి చేయాలని కూడా కోరారు. మీడియాతో మాట్లాడుతూ ఉత్తమ్, ఏపీ గతంలో ఫిర్యాదులు వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేసినా ఇప్పుడు ప్రాజెక్టు పేర్లను మార్చి తిరిగి ముందుకు రావడం దురుద్దేశాన్ని తెలిపుతోందని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల రక్షణ కోసం అవసరమైతే న్యాయపోరాటానికి వెనుకాడబోమని వెల్లడించారు.

# విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టుల అరెస్ట్

**ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా**

**విజయవాడ, కాకినాడలో 31 మంది మావోయిస్టుల అరెస్ట్**

**ఆటోనగర్‌లో కూలీల వేషంలో తలదాచుకున్న నక్సల్స్**

**ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అగ్రనేతలు కూడా అరెస్ట్ అయినట్టు సమాచారం**

**ఏఓబీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం**

**పక్కా సమాచారంతోనే అరెస్టులు చేసినట్లు వెల్లడించిన ఇంటెలిజెన్స్ చీఫ్**

విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు. ఈ పరిణామం రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. అరెస్ట్ అయిన వారిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. విజయవాడ శివారులోని కానూరు న్యూ ఆటోనగర్‌లో ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో మావోయిస్టులు ఆశ్రయం పొందుతున్నారని ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన భద్రతా బలగాలు ఆ భవనాన్ని చుట్టుముట్టి తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాల్లో ఒకేచోట 27 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గమనార్హం. వీరంతా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన కూలీల ముసుగులో ఎవరికీ అనుమానం రాకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యాదర్శి తిప్పిరి తిరుపతి బృందం ఉన్నట్టు తెలుస్తోంది. విజయవాడ ఆటోనగర్‌లోని ఫ్యాక్టరీలు, టింబర్ డిపోలలో ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేస్తుంటారు. ఇదే అదునుగా భావించిన మావోయిస్టులు, వారిలో కలిసిపోయి ఆశ్రయం పొందారు. కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో కలిపి మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా అధికారికంగా ప్రకటించారు. గత నెల రోజులుగా వీరి కదలికలపై నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు. తాజాగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజే కూడా ఉన్నారు. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు జరగడం, ఛత్తీస్‌గఢ్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో, అక్కడి నుంచి తప్పించుకున్న మావోయిస్టులు ఏపీలోని అంతర్గత ప్రాంతాల్లోకి ప్రవేశించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టులకు ఆశ్రయం కల్పించిన భవన యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరికి ఎవరు సహకరించారు, ఏవైనా దాడులకు ప్రణాళికలు రచించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వారి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు ఉద్ధృతంగా ఉన్న రోజుల్లో కూడా ఏపీలోని ఒక నగరంలో ఇంత పెద్ద సంఖ్యలో నక్సల్స్‌ను అరెస్ట్ చేయడం ఇదే తొలిసారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనతో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

# 2019 గ్రూప్-2 ఫలితాలు రద్దు

హైదరాబాద్, నవంబరు 18: బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జారీ చేసిన 2015 గ్రూప్-2 నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో వెలువడిన ఫలితాలను తెలంగాణ హైకోర్టు మంగళవారం రద్దు చేసింది. సమాధానాలు గుర్తించే కీలక విభాగమైన ఓఎంఆర్ పార్ట్-బీలో వైట్‌నర్, ఎరేజర్, బ్లేడ్ వంటి పరికరాలతో ట్యాంపరింగ్ చేసిన అభ్యర్థులను కూడా ఎంపిక చేసిన విధానాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. సాంకేతిక కమిటీ స్పష్టంగా హెచ్చరించినా, నిబంధనలు నోటిఫికేషన్‌లోనే పొందుపరిచినా, ట్యాంపరింగ్ చేసిన పత్రాలను ఎలా పరిగణనలోకి తీసుకున్నారని టీజీపీఎస్సీని కోర్టు ప్రశ్నించింది. కోర్టు తీర్పులో భాగంగా, పార్ట్%-%బీలో దిద్దుబాట్లు చేసిన వారిని వెంటనే అనర్హులుగా ప్రకటించాలని, సమాధాన పత్రాలను పూర్తిగా పునర్మూల్యాంకనం చేసి ఫలితాలను తాజా విధంగా ప్రకటించాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేసింది. ఎనిమిది వారాల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేయాలని కూడా స్పష్టం చేసింది. సమాధాన పత్రాల మూల్యాంకనంలో పారదర్శకత, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల అమలు నిర్బంధమని పేర్కొంది.

# దేశానికి పెద్దన్నగా మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి: రేవంత్‌రెడ్డి

ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకమవుతుందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ మరో కొత్త నగరాన్ని నిర్మించాలని చూస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో పరస్పరం సహకారంతో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్రం కృషి చేస్తోందని, ఈ క్రమంలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కేంద్రం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని నిర్దేశించుకుందని, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు. మోదీ సబర్మతి ప్రక్షాళన చేసినట్లుగా తాము మూసీని చేస్తున్నామని అన్నారు.

# 21న జాతీయ రహదారి దిగ్బంధం రైతులు భారీగా రావాలని కేటీఆర్ పిలుపు



నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. "రైతులకు ఇబ్బంది లేదనుకుంటే ఈరోజు మార్కెట్‌యార్డ్ ఎందుకు మూసేశారు? మమ్మల్ని రైతులను కలవనీయకుండా ఎందుకు అడ్డుకున్నారు?" అని ప్రశ్నించారు. పత్తి కొనుగోలులో తేమశాతం పేరుతో పెట్టిన శాసనాలు, 'కిసాన్ కపాస్' యాప్ తప్పనిసరి నిబంధనలు, ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలన్న ఆంక్షలను కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. అదిలాబాద్‌లో నెట్‌వర్క్ సమస్యలు ఉన్నా, ఫోన్లు లేకున్నా, రైతులు యాప్ ద్వారా అమ్మకాలు జరపాలని ఒత్తిడి చేయడం అర్థరహితమని ఆయన అన్నారు. గతంలో తమ ప్రభుత్వం 20-22% తేమ ఉన్న పత్తినీ కొనగలిగిందని, కానీ ఇప్పుడు కేవలం 12% తేమకే పరిమితం అవడం రైతులను కష్టాల్లోకి నెట్టిందని తెలిపారు. "ప్రైవేట్ వ్యాపారులతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నట్టుంది" అని కేటీఆర్ మండిపడ్డారు. కనీస మద్దతు ధర రూ. 8,100 దక్కాల్సిన రైతులకు ఐదారు వేలు కూడా రాకపోవడం, సోయాబీన్ అమ్మకాలకు ఫింగర్ ప్రింట్ నిబంధనలతో అడ్డంకులు పెరగడం, తల్లిదండ్రుల పేరున్న భూముల్లో పండిన పంటను పిల్లలు అమ్మలేకపోవడం లాంటి సమస్యలను ఆయన ఎత్తిచూపారు. "ఇక్కడి భూసారంలో ఎకరాకు పది%-%పదిహేను క్వింటాళ్లు పండుతాయి. మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్మాలి?" అని ప్రశ్నించారు. కేంద్రం విదేశీ పత్తి దిగుమతులను ప్రోత్సహిస్తూ, దేశీయ పత్తిని కొనకపోవడం రైతులకు భారీ దెబ్బగా ఉందని కేటీఆర్ విమర్శించారు. సుంకాలు తగ్గించడం, దిగుమతులను పెంచడం దేశీయ రైతులకు నష్టం కలిగించే నిర్ణయమన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు పోరాటమే మార్గమని స్పష్టం చేసిన కేటీఆర్, 21న జరగబోయే దిగ్భంధానికి భారీ స్థాయిలో రైతులు రావాలని కోరారు. పంటల కొనుగోలులో ఉన్న తేమ, క్వింటాలు, యాప్ వంటి నిబంధనలు వెంటనే ఎత్తివేయాలని, అకాలవర్షాల నష్టానికి ఎకరాకు రూ. 20,000 పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని హెచ్చరికలు పంపించారు.

# అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి

మావోయిస్టులు అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోవద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయన వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మావోయిస్టులు అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. వారి మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సలైట్లు కారణమని అన్నారు. అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. నక్సలైట్లు ఇప్పటికైనా తుపాకీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని ఆయన పేర్కొన్నారు.

# ఫిరాయింపు కేసులో వేగం

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరా రన్న ఆరోపణలపై కొనసాగుతున్న ఫిరాయింపు కేసుల్లో మరోసారి చురుకుదనం కనిపిస్తోంది. ఈ వివా దంపై రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నిర్ణయం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ పెరిగింది. ఈ నేప ధ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత ఎమ్మెల్యేలకి కొత్త నోటీ సులు జారీ చేస్తూ ఈ నెల

19, 20 తేదీల్లో తప్పనిసరిగా విచారణకు హాజరవాలని ఆదేశించారు. నోటీసుల ప్రకారం ఈరోజు తెల్లం వెంకట్రావు, డా. సంజయ్‌కుమార్ హాజరుకావాల్సి ఉండగా, రేపు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ విచారణకు పిలవబడ్డారు. సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత స్పీకర్ విచారణను వేగవంతం చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ పరిణామాలతో ఫిరాయింపుపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. విచారణ తీర్పు రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చని వర్గాలు భావిస్తున్నాయి.

# జల సంరక్షణలో తెలంగాణ అగ్రస్థానం

భాగీదారీ కార్యక్రమం కింద దేశాన్ని ఐదు జోన్లుగా విభజించిన కేంద్రం, ప్రతి జోన్‌లో కనీసం 10 వేల రీచార్జీలు, సాగు చెరువుల పునరుద్ధరణ, రూఫ్‌టాప్ వర్షనీటి సంరక్షణ వంటి పనులను లక్ష్యంగా పెట్టింది. ఈ కేటగిరీల్లో అత్యుత్తమ ఎంపికైన వారికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో రూ.1 కోటి, మూడో కేటగిరీలో రూ.25 లక్షల బహుమతులు అందజేశారు. జిల్లాల విభాగంలోని కేటగిరీ-1లో దక్షిణ జోన్ నుంచి ఎంపికైన మూడు స్థానాలన్నీ తెలంగాణ ఖాతాలోకి వెళ్లాయి. ఆదిలాబాద్, నల్లగొండ, మంచిర్యాల జిల్లాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రతీ జిల్లాకు రూ.2 కోట్లు చొప్పున బహుమతి లభించింది. మునిసిపల్ కార్పొరేషన్ల విభాగంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో పనిచేసే హైదరాబాద్ జలమండలి రెండో స్థానాన్ని సాధించి రూ.2 కోట్ల పురస్కారాన్ని అందుకుంది. కేటగిరీ%-%2లో వరంగల్, నిర్మల్, జనగామ జిల్లాలు మొదటి స్థానాల్లో నిలిచి చెరో కోటి రూపాయలు పొందాయి. కేటగిరీ%-%3లో భద్రాద్రి కొత్తగూడెం మొదటి ర్యాంకు, మహబూబ్‌నగర్ మూడో ర్యాంకును సాధించాయి. వీటికి చెరో రూ.25 లక్షలు లభించాయి.

**నోడల్ అధికారులకు ప్రత్యేక పురస్కారం**

జిల్లాల స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన నోడల్ అధికారి పురస్కారం కేంద్ర జల సంఘం అధికారి ఎ. సతీష్‌కు దక్కింది. అదిలాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు పలువురు కలెక్టర్లు, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ గుమ్మళ్ల సృజన, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ అశోక్ కుమార్ రెడ్డి తదితరులు కూడా రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డులు స్వీకరించారు. ఈ విజయాలు జల సంరక్షణలో తెలంగాణ తీసుకున్న పద్ధతిసముచిత చర్యలకు జాతీయస్థాయి ముద్ర వేస్తూ, ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచాయి.

# ఐబొమ్మ రవి కేసులోకి ఈడీ

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

# పత్తి రైతుల పక్షాన బీఆర్ఎస్ - నిరంతర పోరాటం

**- సిసిఐ కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా**

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మంత్రి శ్రీనివాస్ గౌడ్, గోలి శ్రీనివాస్ రెడ్డి**



కల్వకుర్తి నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి ప్రాంతంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి స్థానిక రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది పత్తి పంటకు రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన పంటను ప్రభుత్వం,సీసీఐ పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీసీఐ అమలు చేస్తున్న ఎకరానికి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి రైతులకు అన్యాయం చేస్తున్నదని, దాన్ని తక్షణమే తొలగించాలన్నారు. రైతులు ఎన్ని క్వింటాళ్లు పండించినా, రైతు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయడం ప్రభుత్వ ధర్మం అని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్లే రైతులు అవస్థలు పడుతున్నారని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య లత కాటన్ మిల్ అధ్యక్షులు సూర్య ప్రకాష్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్మ సత్యం, జిల్లెల్ల మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, విజయ్ గౌడ్, రమేష్,కిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 24న బిజెపి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల ముందు శాంతియుత ధర్నా

ఓయూ బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ




సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 18.... ఈనెల 24న కాంగ్రెస్ బిజెపిల రాష్ట్ర కార్యాలయాల ముందు శాంతియుత ధర్నాను దిగ్విజయం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల రక్షణకు రాజ్యాంగ సవరణ చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ బిజెపిలపైనే ఉందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామంటే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు కేవలం బీసీల గెలుపుగానే చూడాలని, అది కాంగ్రెస్ గెలుపు ఏమాత్రం కాదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బీసీలు రాజకీయంగా బొంద పెడతారని అన్నారు. సామాజిక న్యాయం అంటూ దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. పార్లమెంటులో వెంటనే ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ ప్రధానినని చెప్పుకునే నరేంద్ర మోడీ.. బీసీల 42 శాతం రిజర్వేషన్ రక్షణ కోసం రాజ్యాంగ సవరణకు ఎందుకు ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. నిరంతరం హిందువుల గురించి మాట్లాడే కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టిలో బీసీలు హిందువులు కారా అని ప్రశ్నించారు. బీసీ జనసభ ఆధ్వర్యంలో ఈనెల 24న కాంగ్రెస్, బిజెపిల రాష్ట్ర కార్యాలయాల ముందు తలపెట్టిన శాంతియుత ధర్నాను ( గాంధీగిరి ) దిగ్విజయం చేయాలని ఓయూ బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, అల్లంపల్లి రామకోటి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రవంక చిన్న రామస్వామి, గ్లాస్ గ్లాసులు తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ యాదవ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సం,ఘాల జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్, అధ్యక్షుడు చేరాల వంశీ, అధికార ప్రతినిధి నూకాల మధు యాదవ్, అశ్వన్, మనోజ్ గౌడ్, శ్రీనివాస్, సంతోష్ యాదవ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతుల సమస్యలు తీర్చేదాక బిఆర్ఎస్ పోరాటం ఆగదు.. సబితా ఇంద్రారెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 : రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల మీద బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం నాడు పరిగి నియోజకవర్గం పరిధి పూడూరు మండల కేంద్రంలో పత్తి రైతులు కోసం పూడూరు పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిగి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు మెతుకు ఆనంద్ తో కలిసి పరిశీలించిన మాజీ మంత్రి మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పత్తి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షత చూపుతున్నాయని అన్నారు అకాల వర్షాలతో, అననుకూల వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే దిగుబడి రాక అతలాకుతలమవుతున్న పత్తి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందిందని. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రాష్ట్రంలో ఏ మార్కెట్లో కూడా అమలు కావడం లేదని. తేమశాతం పేరుతో పత్తి రైతులను వ్యాపారులు, ప్రభుత్వము నిలువునా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన పత్తిని అన్ని మార్కెట్లలో తేమ శాతంతో సంబంధం లేకుండా తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మార్కండేశ్వర దేవాలయంలో ఘనంగా శివ పంచాక్షరి యజ్ఞం

సంస్థాన్ నవంబర్ 18( వార్త మిర్రర్ ): నారాయణపూర్ మండల కేంద్రంలోని శ్రీ శివ భక్త మార్కండేశ్వర దేవాలయంలో మంగళవారం రోజు మాస శివరాత్రి సందర్భంగా శివ పంచాక్షరి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సూరపల్లి కుచేల్, ఉపాధ్యక్షులు చెరుపల్లి లక్ష్మయ్య మిరియాల రాజరత్నం, ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకటేశం, కోశాధికారి ఏల నరసింహ సహాయ కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిలు మకాం శ్రీనివాస్, కర్నాటి నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు మాకం యాదగిరి, దోర్నాల అంజయ్య, పున్న విజయ్ కుమార్, మకాం రామకృష్ణ, సూరపల్లి రాములు, సింగం భాస్కర్ పాల్గొన్నారు ఆలయ పూజార్లు చిట్యాల వెంకటేశం పంతులు చిట్యాల నరేష్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు



## మాదక ద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలి

**::: రాయికల్ మున్సిపల్ కమిషనర్**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 18మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమ వుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ కమిషనర్ సూచించారు. ఈ సందర్బంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్ళను చేయాలనే ఆశతో ఉంటే, కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. దీనికి సంబంధించిన ప్రతిజ్ఞ ను సీనియర్ అసిస్టెంట్ హరీశ్ చదివి వినిపించారు. ఇట్టి కార్యక్రమం లో మున్సిపల్ మేనేజర్, ఆఫీస్ సిబ్బంది మెప్మా సిఓ, ఆర్పీ లు పాల్గొన్నారు.



## రాయికల్‌లో రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహన సదస్సు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 18 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని పాక్స్ నందు మంగళవారం రోజున ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యలో రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్క నాటిన 3 సంవత్సరాల నుండి దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు కొనసాగునని తెలిపారు. మొక్కలను 90% సబ్సిడీ పై 20 రూ./- లకే ఇస్తున్నామని, డ్రిప్ పై 80%-100% సబ్సిడీ అందిస్తున్నామని, ప్రతి ఎకరానికి 4200/- సంవత్సరానికి చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 5000 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని, వరి పంటతో పోలిస్తే అకాల వర్షాలు, వడగళ్ళ వానలవల్ల నష్టం ఉండదని, కోతుల బెడద ఉండదని,1993 ఆయిల్ పామ్ చట్టం ప్రకారం గెలలను ప్రభుత్వం నిర్ధారించిన రేట్ కు కంపెనీ కొనుగోలు చేస్తుందని, ప్రస్తుతం టన్ను ధర రూ. 19700/- ఉందని తెలిపారు. రాయికల్ వ్యవసాయ అధికారి ముక్తీశ్వర్ మాట్లాడుతూ రైతులు వరి కొయ్యకాలు కాల్చవద్దని, భూసారం పెంచుకోవాలని, కోతుల బెడద లేని ఆయిల్ పామ్ పంట నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన అధికారి కె. స్వాతి, వ్యవసాయ అధికారి ముక్తీశ్వర్, ఉద్యాన విస్తరణ అధికారి రాజేష్, రాయికల్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహనరెడ్డి, సీఈఓ ఎలిగేటి రవికుమార్, మాజీ చైర్మన్ పడిగెల రవీందర్ రెడ్డి, లోహియా కంపెనీ ప్రతినిది గణేష్, కుమార్ డ్రిప్ కంపెనీ సిబ్బంది తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం:

**- ఉప్పల ట్రస్ట్ చైర్మన్- వెంకటేష్**

కల్వకుర్తి నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొంగళ్ళ జంగయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తుర్కపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ మృతురాలు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బీసీ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్,దారమోని గణేష్,ఐలా శేఖర్ గౌడ్,వీరపాకుల నాగరాజు, మట్టా కృష్ణయ్య, ఐలా నాగయ్య గౌడ్,కొంగళ తిరుపతి, పరిశరాములు, నరసింహ, మల్లేష్,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో నారీశక్తి అవగాహన కార్యక్రమం


కల్వకుర్తి నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి:–కల్వకుర్తి శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మాతృమండలి ఆధ్వర్యంలో మహిళా సప్తశక్తి సంఘం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నిర్మల సభాధ్యక్షులుగా వ్యవహరించి, ప్రధాన ఉద్దేశాలు మరియు స్వరూపం గురించి వివరించారు.కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా కూన స్వప్న పాల్గొని, భారతీయ కుటుంబ వ్యవస్థ విశిష్టతను వివరించి, కుటుంబ ప్రబోధం పై విలువైన సందేశాలను అందించారు. రాధిక నారీశక్తి ప్రధాన పాత్ర, సమాజ నిర్మాణంలో మహిళల యోగదానం గురించి వివరించి, పాల్గొనేవారికి స్ఫూర్తి నింపారు.వక్తలను పాఠశాల బృందం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సేవకుల రాజు, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థినీలు, పాఠశాల ప్రజాభంధ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.



## బాధితులకు బలమైన అండ - రాధాకృష్ణ ట్రస్ట్

**- పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం**

కల్వకుర్తి నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి:– కడ్తాల్ మండలంలోని ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కొండ్రిగాని బోర్డు తండ గ్రామపంచాయతీ పరిధిలోని పిల్లిగుండు తండా గ్రామానికి చెందిన సభావట్ పీప్లి, మక్త మాదారం గ్రామపంచాయతీ చెందిన ఎండి జహీరా బేగం కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ" 5000 రూపాయలు చొప్పున రెండు కుటుంబాలకు రూ "10,000 ఆర్థిక సాయం అందించారు. అనంతరం బీసీ మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేష్ తండ్రి సోమవారం సాయంత్రం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ అమంగల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్జున్ రావు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సులోచన సాయిలు నరసింహ మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి ప్రియా రమేష్ మాజీ ఉపసర్పంచ్ శ్రీను నాయక్ పాండు నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ నాయకులు కృష్ణయ్య మహేష్ జలీల్ రాములు నాయక్ సత్యనారాయణ రాజు గణేష్ వెంకటేష్ సక్రు నాయకులు పాల్గొన్నారు



## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్నం డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

**ఘనంగా సన్మానించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిభువనగిరి పట్టణ కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఆర్ ఎస్ కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ని ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయి అని తెలిపారు,

## ఓటు చైతన్యంతో రాజ్యాధికారం సాధించుకుందాం- ఉప్పల శ్రీను



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు చైతన్యంతో బీసీ లందరూ మన ఓటు మనకే వేసుకొని భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బీసీలను గెలిపించుకొని రాజ్యాధికారం సాధించుకోవాలని సంస్థాన్ నారాయణపురం బీసీ నాయకులు ఉప్పల శ్రీను అన్నారు. 65 శాతం ఉన్న మనం స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా రిజర్వేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నామని, భవిష్యత్తులో అందరం ఏకమై బీసీలకు అధికారం వచ్చేంతవరకు పోరాడుదాం అన్నారు

# నవీన్ యాదవ్ ను హెూం మంత్రి చేయాలి

## జూపల్లి రాములు



కల్వకుర్తి, నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి:-తెలంగాణలో ప్రజల సంక్షేమం కోసం జూపల్లి రాములు,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను హెూం మంత్రిగా నియమించాల్సిన అవసరం ఉందని మద్దతు ప్రకటించారు.జూపల్లి రాములు మాట్లాడుతూ..తెలంగాణ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలంటే, కేటీఆర్ వంటి నాయకులు భూములు, డబ్బులు కొంత మంది కబ్జా చేస్తూ పేదలకు హక్కులు ఇవ్వడం లో విఫలమయ్యారు. అలాంటి పరిస్థితులను సరిచేయడానికి నవీన్ యాదవ్ లాంటి సక్రమ, కచ్చితమైన నాయకుడిని హెూం మంత్రి చేయాలి," అని పేర్కొన్నారు.

## చట్ట వ్యతిరేక పనులు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి

### చౌటుప్పల్ సిఐ జి. మన్మధ కుమార్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 18 : చౌటుప్పల్ మండల కేంద్రంలోని చౌటుప్పల్ సిఐ జి. మన్మధ కుమార్, పత్రిక ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ఈ మధ్యకాలంలో చట్ట వ్యతిరేకంగా విపరీతంగా లక్కీ డిప్ లు అని, లాటరీలు అని, ప్రజల యొక్క ఆశలను ఆసరాగా చేసుకుని, మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి అని ప్రజలను మభ్యపెడుతూ కేవలం కొంత మొత్తంలో అమౌంట్ చెల్లిస్తే ఫ్రీగా ప్లాట్లు గెలుచుకోవచ్చు అని, కొత్త కొత్త బైకులు గెలుచుకోవచ్చు అని, వివిధ రకాల వస్తువులు గెలుచుకోవచ్చు అని, పెద్ద మొత్తంలో అమౌంటు గెలుచుకోవచ్చు అని ఆశ చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతూ చట్ట వ్యతిరేకంగా లాటరీలు అని, లక్కీ డిప్ లు అని, చీటిలు డ్రా తీయబడును అని వివిధ రకాలుగా ప్రజలను మోసం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు, ఎవరైనా ప్రజలను, ప్రభుత్వాలను మోసగించే విధంగా ఇటువంటి చట్ట వ్యతిరేక పనులు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకొనబడును. ప్రజలు కూడా ఇటువంటి వాటి పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని తెలియజేయడం జరుగుతుంది.



## భవిష్యత్ భాగ్యనగరం ఫ్యూచర్ సిటీనే: కిచ్చన్న

### -గ్లోబల్ సమ్మిట్ తో మారనున్న మహేశ్వరం ముఖచిత్రం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 18 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రం లో ప్రపంచంలో ఉన్న ప్రముఖ విద్య, ఆరోగ్య సహ ఇతర సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 8,9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నారని కేఎల్ఆర్ గుర్తు చేశారు.మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు భారత్ ఫ్యూచర్ సిటీలో పరిపాలన భవన్ నిర్మాణం సహ గ్లోబల్ సమ్మిట్ కోసం ఎంపిక చేసే స్థలాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ భాగ్యనగరం ఫ్యూచర్ సిటీనే కాబోతుందని మరోమారు స్పష్టం చేశారు. అంతర్జాతీయ సంస్థలు, పెట్టుబడులను.ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారీ సదస్సు నిర్వాహణకు హైదరాబాద్ నగరంలో 4 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. ఇప్పటికే స్కిల్ యూనివర్శిటీ, ఇతర భవనాల పనులు జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న మ్యాప్ లను కేఎల్ఆర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## నాగార్జునసాగర్ లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు పరిశీలించిన కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ

మిర్యాలగూడ , నవంబర్ 18:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోనీ నాగార్జునసాగర్ (నందికొండ) పట్టణంలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సైనిక్ స్కూలు ఏర్పాటుకు ఆ శాఖ ఆధ్వర్యంలో ఒక టీం మంగళవారం పరిశీలించిందని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ తెలిపారు. టీం సభ్యులతో చర్చించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సాగర్ లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి అదే పాఠశాలలో సైనిక్ స్కూలు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను వారు పరిశీలించారన్నారు. నల్లగొండ జిల్లాకు రెండు సైనిక్ స్కూల్స్ మంజూరయ్యాయని ఒకటి కేతెపల్లి మండలం మూసి ప్రాజెక్టు సమీపంలోని పాఠశాల కూడా ఉందన్నారు. ప్రస్తుతం సాగర్ లోనీ బీసీ గురుకులంలో ఏర్పాటు చేసే స్కూలులో ప్రస్తుతం ఉన్న బిసి విద్యార్థులు కూడా అందులోనే అభ్యసించే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. గురుకులం సందర్శించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. సైనిక్ స్కూలు విషయంలో త్వరలో నివేదిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు తెలిపారు. అన్ని అనుకూలిస్తే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సైనిక్ స్కూలుకు అనుకూలంగా ఉండే విధంగా ఆధునీకరణ చేసే అవకాశాలుంటాయని ఆయన తెలిపారు. మిర్యాలగూడ డివిజన్ కు సైనిక్ స్కూలు రావడం శుభ సూచకమని ఆయన అన్నారు. పరిశీలించిన గ్రూపు లీడర్ ఎయిర్ ఫోర్స్ అధికారి, బీజాపూర్ సైనిక్ స్కూలు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్, నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్, జిల్లా బిసి గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ స్వప్న ఉన్నారు.

# చింతల భూపాల్ రెడ్డి ఆశయ సాధన నిజమైన నివాళులు....

### సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

### అమరజీవి కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 18

చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎంపీటీసీగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా తన జీవితాంతం పేద ప్రజల సంక్షేమం కోసం సిపిఎం పార్టీ విస్తరణ కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు .పార్టీ నిర్మాణంలో కందాల రంగారెడ్డి వారసత్వాన్ని అందుకొని పార్టీపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను తిప్పుకొట్టడంలో చౌటుప్పల్ ప్రాంతంలో కీలకంగా పని చేశారని అన్నారు. సర్పంచ్ గా పనిచేస్తున్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోనే చౌటుప్పల పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్న వ్యక్తి భూపాల్ రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండడం ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించడం ఆయన దినచర్యగా ఉండేదని అన్నారు. పార్టీ లో పని చేసే యువ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడంలో వారిని ప్రోత్సహించడంలో ఆయనది ఒక ప్రత్యేకమైన స్థానమని అన్నారు.అమరజీవి కందాల రంగారెడ్డి మరణాన్ని అనంతరం చౌటుప్పల్ ప్రాంతంలో పార్టీని మరింత నిర్మాణం చేయడంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి కాపడటంలో కీలకంగా పని చేశారని వారు ఈరోజు భౌతికంగా దూరం కావడం బాధాకరమని వారి యొక్క ఆశయాలను ఆదర్శాలను పాటిస్తూ ముందుకు సాగడం వారికిచ్చే ఓ ఘనమైన నివ్వాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య ,జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్ ,బొంతల చంద్రారెడ్డి ,కొండమడుగు నరసింహ , ఆశయ,బూర్గు కృష్ణారెడ్డి ,గంగాదేవి సైదులు, ఎండి పాషా, గోశిక కరుణాకర్, అవ్వారు రామేశ్వరి బండారు నరసింహ, బత్తుల శ్రీశైలం, చింతల దామోదర్ రెడ్డి ,దండా అరుణ్ కుమార్ ,గోపగోని లక్ష్మణ్ ,నివాళు లర్పించడం జరిగింది..

# మత్తు మందులు, ఆల్కహాల్ వంటి చెడు వ్యాసనాలకు యువత దూరంగా ఉండాలి

### నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




నల్గొండ నవంబర్ 18 వార్త మిర్రర్ ప్రతినిధి యువత మత్తుపదార్థాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో పోలీస్, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగం పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మత్తు మందులు, ఆల్కహాల్ వంటి చెడు వ్యాసనాలకు యువత బానిసలు కావద్దని, ఇవి స్లో పాయిజన్ లాంటివని, ఒకసారి అలవాటైతే వదులుకోవడం కష్టమని, దీనివల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. నిషేధిత పదార్థాలను తీసుకోవడం తప్పు అని, జీవితం బాగుండాలంటే కష్టపడి చదువుకోవాలని, చదువు వదిలేసి మత్తుమందులకు అలవాటు పడితే జీవితాంతం ఇబ్బందులకు గురికావలసి వస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, అందువల్ల క్రమశిక్షణతో, ఓపికగా చదువుకోవాలని, మంచి పౌరులుగా ఎదగాలని, చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాల్సిన అవసరం ఉందని అన్నారు.అడిషనల్ ఎస్పీ రమేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని, భారత దేశంలో ఎక్కువగా మానవ వనరులు ఉన్నాయని, యువత చెడుగా అలవాటులకు బానిస కావద్దని పిలుపునిచ్చారు.జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ రమణా తదితరులు మాట్లాడారు. జిల్లా ఉపవైద్యా ఆరోగ్యశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్బంగా మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

# 1.50 కోట్ల రూపాయల సొంత నిధులతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారు.

### నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 18తరగతి గదిలో విద్యార్థులు ఏకాగ్రతతో శ్రద్ధగా చదవాలంటే మెరుగైన సదుపాయాలు ఉండాలనే ఆలోచనతో పనిచేస్తున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు.దాంట్లో భాగంగానే మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1.50 కోట్ల రూపాయల సొంత నిధులతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారు.నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు.దాంట్లో భాగంగానే చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని తన వ్యక్తిగత క్యాంప్ కార్యాలయంలో నారాయణపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నూతన భవనాల నిర్మాణం, నూతన బాత్రూంలు టాయిలెట్స్ నిర్మాణం, డైనింగ్ హాల్స్, వంటగది, ప్రహరీ గోడ నిర్మాణం, ఆటస్థలం ఆధునీకరణ తో పాటు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం విద్యాశాఖ అధికారులు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వ నుండి మంజూరై వస్తున్న నిధుల కు తోడు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున కూడా సొంత నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.. నారాయణపూర్ కస్తూరిబా బాలికల పాఠశాల నూతన భవనాల నిర్మాణ నమూనాను గౌరవ ఎమ్మెల్యే గారికి చూయించారు అధికారులు.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా భవనాల నిర్మాణ నమూనాలో పలు మార్పులు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని అధికారులను కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ చలికాలంలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయడం చాలా కష్టంగా ఉంటుందని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడినీటి కోసం గీజర్లు ఏర్పాటు చేస్తామని వీటి తో పాటు, ఇన్వర్టర్, డైనింగ్ హాల్, టాయిలెట్స్ కి సహకారం అందిస్తామన్నారు.రాత్రి సమయంలో వసతి గృహాలలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని నారాయణపురం మండల కేంద్రంలోని కేజీబీవీ మోడల్ స్కూల్, చౌటుప్పల్ లోని కేజీబీవీ మోడల్ స్కూల్ గురుకుల పాఠశాల, చౌటుప్పల్ మండలం తూప్రాంపేటలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు విద్యుత్ సమస్య రాకుండా ప్రతి పాఠశాలకు 100 కేవీ ట్రాన్స్ఫార్మర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఫోన్లో ఆదేశించారు...ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) సత్యనారాయణ, చౌటుప్పల్ ఎంఈఓ గురువారెడ్డి, డిఈ శివ కుమార్, కాంట్రాక్టర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు....

# పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన సాగర్ ఎమ్మెల్యే జయవీర్



మిర్యాలగూడ, నవంబర్ 18:-( వార్త మిర్రర్) నాగార్జునసాగర్ శాసనసభ నియోజకవర్గంలోని తిరుమలగిరి సాగర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు,ఐకెపి(ఇందిరా కాంతి పథం)సెంటర్ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు సజావుగా చేయాలని వ్యవసాయ అధికారులకు మిల్లర్లకు పలు సూచనలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పిహెచ్సి, పోలీస్ స్టేషన్ పలు గవర్నమెంట్ ఆఫీసులకు కావలసిన స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చే 4 ఎకరాల భూమిని మంజూరు చేయించిన స్థలాన్ని పరిశిలించారు.గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేయించి పాఠశాల సందర్శనమండలంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పూర్వ విద్యార్థులు స్కూలుకు సంబంధించిన ప్రహరీ గోడ వాటర్ ట్యాంక్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రాగా వెంటనే పరిష్కారం చేశారు. కార్యక్రమంలో మండల ప్రజలు, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.



## పందుల వల్ల ఇబ్బందులు పడుతున్నాం సమస్య పరిష్కరించాలంటూ కమిషనర్ కు వినతి పత్రం

మిర్యాలగూడ ,నవంబర్ 18:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం గాంధీనగర్ 35 వార్డులో పందుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆ వార్డు కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ కు సమర్పించిన వినతిపత్రం పేర్కొన్నారు. పందుల వల్ల పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. చిన్న పిల్లలను పందులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆయన తెలిపారు. పట్టణంలో దాదాపు సగభాగంలో పందులు లేవని గాంధీనగర్లోనే ఉన్నాయని వాటిని నివారించాలని కమిషనర్ ను కోరారు.

## లక్కీడ్రా ల పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు... సీఐ మన్మధ కుమార్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 18 : స్థిరాస్తుల అమ్మకాల కోసం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో లక్కీ డ్రా లు లాటరీల పేరుతో ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని మోసం చేయాలని చూస్తే వారి పట్ల ఏమాత్రం. ఉపేక్షించేది లేదని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ జి మన్మధ కుమార్ హెచ్చరించారు. 500 రూ రూపాయలు ,1000రూ పాయలకే ఇల్లు, బైకు, కారు గెలుచుకునే గొప్ప అవకాశం అంటూ లక్కీ డ్రా పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అదృష్టాన్ని పరీక్షించుకోండి అంటూ ఆశ చూపిస్తూ చట్ట వ్యతిరేక పనులు చేసే వారిని ఉపేక్షించేది లేదంటే తెలిపారు. లాటరీలు, లక్కీ డ్రా లు నిర్వహించే వారిపై ఎవరు ఫిర్యాదు చేసిన తక్షణమే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మొబైల్ రీచార్జీలకు రెక్కలు!

### 10 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం
### వచ్చే నెల చివర్లో టారిఫ్‌లు పెంచేయోచనలో సంస్థలు




న్యూఢిల్లీ, నవంబర్ 8: మొబైల్ వినియోగదారులకు మళ్లీ షాకివ్వబోతున్నాయి టెలికాం సంస్థలు. ఇప్పడికే మొబైల్ చార్జీలను పెంచి కస్టమర్ల జేబులకు చిల్లులు పెట్టిన సంస్థలు తాజాగా మరోసారి రీచార్జీలను పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఏడాది క్రితం 23 శాతం వరకు చార్జీలను వడ్డించిన సంస్థలు మళ్లీ ఈ స్థాయిలో పెంచడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెల 1 నుంచి తమ మొబైల్ రీచార్జి ప్లాన్ల ధరలను 10-12 శాతం వరకు పెంచేయోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. దేశీయ టెలికాం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో ప్రీ-పెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్లు మరింత భారం కాబోతున్నాయి. నిర్వహణ ఖర్చులు సాకుగా చూపెడుతూ టెలికాం టారిఫ్‌లను భారీగా పెంచిన సంస్థలు..ఈసారి కూడా ఇదే సాకుగా చూపెడుతు, అలాగే 5జీ సేవలు అందించడానికి భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తున్నదని, దీంతో సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడానికి టారిఫ్‌లను పెంచకతప్పడం లేదని టెలికాం ఇండస్ట్రీ వర్గాలు సూచనప్రాయంగా చెబుతున్నారు. అన్ని సంస్థలు ఇప్పటికే 4జీ సేవలను అందిస్తుండగా, వీటిలో కొన్ని సంస్థలు 5జీ సేవలను కూడా స్టార్ట్ చేశాయి. 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి నూతన టవర్లు, అలాగే స్పెక్ట్రం కొనుగోలు చేయడానికి వేలాది కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తున్నదని కంపెనీల వాదన. ఇదే సమయంలో రోజురోజుకు నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని, దీంతో చార్జీలు పెంచాల్సి రావచ్చునని విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈసారి మాత్రం అన్ని ప్లాన్లను ధరలు పెంచకపోవచ్చని, కేవలం ప్రారంభ, మధ్య, గరిష్ఠ స్థాయి ప్లాన్లను వడ్డించే అవకాశాలు మెండుగావున్నాయి. జులై 2024లో టెలికాం సంస్థలు తమ టారిఫ్‌లను 11 శాతం నుంచి 23 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే.

**డాటా వినియోగంలో టాప్**

దేశవ్యాప్తంగా మొబైల్ డాటా వినియోగం భారీగా పుంజుకుంటున్నది. సరాసరిగా భారత్‌లో ఒక్కో వినియోగదారుడు నెలకు 27 జీబీల నుంచి 35 జీబీల వరకు డాటాను వినియోగిస్తున్నారు. డాటా వినియోగం విస్తృతమవుతుండటంతో టెలికాం సంస్థలు వీరికి నాణ్యమైన సర్వీసులు అందించడానికి భారీగా టవర్లను నెలకొల్పుతున్నాయి.

**చిన్న ప్లాన్లకు గుడ్‌బై**

ఇప్పటికే పలు టెలికాం సంస్థలు చిన్న స్థాయి ప్లాన్లకు గుడ్‌బై పలికాయి. ఎంట్రీ లెవల్ ప్యాక్‌లను ఎత్తివేయడంతోపాటు డాటా ప్యాక్‌లో కోత పెట్టాయి కూడా. గడిచిన కొన్ని నెలల క్రితం జియో, ఎయిర్‌టెల్ సంస్థలు రోజుకు 1జీబీ డాటా ప్యాక్‌ను ఎత్తివేసి..ఈ స్థానంలో 1.5 జీబీ డాటా ప్లాన్‌ను రూ.299తో ప్రారంభించింది. పాత ప్లాన్ చార్జీతో పోలిస్తే 17 శాతం పెంచింది. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 1జీబీ డాటా ప్లాన్ రూ.299ని కొనసాగించింది. టారిఫ్‌ల పెంపుపై తక్షణమే పెంచే ఆలోచన లేదని, కానీ భవిష్యత్తులో పెంచకతప్పదని దిగ్గజ టెలికాం కంపెనీ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో 5జీ సర్వీసులు అందుబాటులోకి వచ్చేవరకు ఈ పెంపు తప్పదని, దీర్ఘకాలికంగా టెలికాం సేవలు అందించాలంటే చార్జీలు సవరించాల్సిన అవసరం ఉన్నదని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి.

# భారత్ వైపు.. స్టార్టప్స్ చూపు...

### మన మార్కెట్లో విస్తరణపై
### సింగపూర్, కెనడా అంకురాల ఆసక్తి
### భారీ మార్కెట్, అధిక వృద్ధి అవకాశాలే కారణం



న్యూఢిల్లీ: దేశీయంగా భారీ మార్కెట్, వేగవంతమైన ఆర్థిక వృద్ధి తదితర అంశాల కారణంగా పలు అంతర్జాతీయ అంకుర సంస్థలు భారత మార్కెట్లో విస్తరించే యోచనలో ఉన్నాయి. సింగపూర్, కెనడా తదితర దేశాలకు చెందిన స్టార్టప్స్ వీటిలో ఉన్నాయి. హాంకాంగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పార్క్స్ కార్పొరేషన్ (హెచ్‌కేఎస్‌టీపీ) నిర్వహించిన గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ 'ఎపిక్ 2025'లో పాల్గొన్న సందర్భంగా పలు విదేశీ అంకుర సంస్థలు భారత్‌పై ఆసక్తి వ్యక్తం చేశాయి. 70 పైగా దేశాలకు చెందిన 100 స్టార్టప్స్ నుంచి ఈ కాంపిటీషన్‌కి సుమారు 1,200 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భారత్ నుంచి రెండు అప్లికేషన్లు ఉన్నాయి. ఈ దరఖాస్తులను ప్రధానంగా డిజిటల్ హెల్త్ టెక్, ఫిన్‌టెక్, గ్రీన్‌టెక్ అని మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఎంట్రప్రెన్యూర్లను వర్ధమాన మార్కెట్లు, ఇన్వెస్టర్లు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణల వ్యవస్థలకు అనుసంధానం చేసేందుకు ఎపిక్ 2025 తోడ్పడుతుందని హెచ్‌కేఎస్‌టీపీ చైర్మన్ సన్నీ తెలిపారు.

**సానుకూల పరిస్థితులు ఆకర్షణీయం..**

భారత్‌లో స్టార్టప్‌లకు అనువైన వ్యవస్థ ఉందని బ్యాటరీ రీసైక్లింగ్ కార్యకలాపాలు సాగించే సింగపూర్ సంస్థ న్యూ బ్యాటరీ మెటీరియల్స్ చైర్మన్ బ్రయాన్ తెలిపారు. ఇక్కడ భారత్‌లో పెద్ద సంఖ్యలో టూ%-%వీలర్లు, త్రీ%-%వీలర్లతో భారీ మార్కెట్ ఉందని తెలిపారు. బ్యాటరీ రీసైక్లింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న స్టార్టప్‌లు మెరుగ్గా రాణిస్తున్నాయని వివరించారు. భారత ప్రభుత్వ విధానాల గురించి మరింత తెలుసుకోవడంపై ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రీన్‌టెక్ కేటగిరీలో న్యూ బ్యాటరీస్ మెటీరియల్స్ విజేతగా నిల్చింది. మరోవైపు, ఏ ఇన్వెస్టరుకైనా భారత్‌లో పెట్టుబడులకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఎయిర్ కార్గో సాఫ్ట్‌వేర్ తయారు చేసే సింగపూర్ కంపెనీ 'బెల్లి' ప్రొడక్ట్ ఇంజినీర్ జేడెన్ తెలిపారు. భారత్‌లో అంకురాలకు మంచి భవిష్యత్తు ఉండగలదన్నారు. భారత మార్కెట్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కెనడాకి చెందిన కేఏ ఇమేజింగ్ ప్రెసిడెంట్ అమోల్ ఎస్ కార్నిక్ చెప్పారు. సైన్స్, మెడికల్ టెక్నాలజీల అభివృద్ధికి భారత ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం తమకు ఒక అవకాశంగా ఉపయోగపడగలదని పేర్కొన్నారు. తమ సంస్థకు అనువైన మరిన్ని విధానాలపై అధ్యయనం చేస్తామని వివరించారు.

# ఓఎఫ్ఎస్ బాటలో ప్రమోటర్లు

### విలువపరంగా ఈ ఏడాది ఐపీవోల్లో 65 శాతం భాగం
### గతేడాది ఇది 59 శాతం
### టాప్‌లో విశాల్ మెగామార్ట్, మ్యాన్‌కైండ్ మొదలైనవి



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూల్లో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో ప్రమోటర్లు వాటాలను విక్రయించడం గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు (జనవరి-నవంబర్) వచ్చిన ఐపీవోల్లో విలువపరంగా ఓఎఫ్ఎస్ పరిమాణం సుమారు 65 శాతంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో ఇది మొత్తం ఐపీవోల్లో 58 శాతంగా, 2024లో 59 శాతంగా నిల్చింది. 2023లో మొత్తం ఐపీవోల్లో (సంఖ్యాపరంగా) 15.8 శాతం ఇష్యూలు పూర్తిగా ఓఎఫ్ఎస్ విధానంలోనే వచ్చాయి. గతేడాది ఈ నిష్పత్తి 15.4 శాతంగా ఉండగా, ఈ ఏడాది 16.5 శాతానికి చేరింది. వ్యాపార విస్తరణ ఇతరత్రా అవసరాల కోసం సదరు ఇష్యూల్లో తాజా షేర్ల జారీ ద్వారా కంపెనీలు కొత్తగా నిధులు సమీకరించలేదు. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లే తమ వాటాలను ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయించుకున్నారు. 2024లో హ్యుందాయ్, 2025లో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ తరహా మెగా ఐపీవోల జాబితాలో నిల్చాయి. గడిచిన మూడేళ్లలో విలువపరంగా ఓఎఫ్ఎస్ వాటా అత్యధికంగా ఉన్న టాప్ ఐపీవోల్లో విశాల్ మెగా మార్ట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, టాటా టెక్నాలజీస్, ఉయ్‌వర్క్ ఇండియా, శాగిలిటీ ఇండియా, ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్, సెల్లో వరల్డ్, ఓర్క్‌లా ఇండియా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా ప్రమోటర్లు, బడా సంస్థాగత ఇన్వెస్టర్లు మొదలైన వర్గాలు ఓఎఫ్ఎస్ విధానంలో వాటాలు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆఫర్ ఫర్ సేల్ విధానంలో అత్యధికంగా ప్రమోటర్లే విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025లో వచ్చిన ఇష్యూలకు సంబంధించి ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు సేకరించిన నిధులు (విలువపరంగా) 68.5 శాతంగా నమోదైంది. 2023లో ఈ నిష్పత్తి 52.8 శాతంగా నిల్చింది. పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలోనే వచ్చిన టాప్ ఐపీవోల జాబితాలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెక్సావేర్ టెక్నాలజీస్, ష్లాస్ బెంగళూరు, విక్రమ్ సోలార్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఆఫ్కాన్స్ మొదలైనవి ఉన్నాయి.

**మెరుగ్గా మార్కెట్లు..**

పబ్లిక్ ఇష్యూల్లో ఓఎఫ్ఎస్ వాటా పెరుగుతుండటమనేది దేశీ క్యాపిటల్ మార్కెట్ వ్యవస్థ పరిపక్వ స్థాయికి చేరుతున్న సంకేతంగా భావించవచ్చని ప్రైమ్ డేటాబేస్ వర్గాలు తెలిపాయి. 1990లు, 2000ల ప్రాంతంలో చాలా మటుకు ఐపీవోలు తాజాగా పెట్టుబడులు సమీకరించాయని, అలాంటి కంపెనీల పరిస్థితి ఏమైందనేది అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించాయి. ఇక పెద్ద సంఖ్యలో ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ బాట పడుతున్నప్పటికీ, ఆయా కంపెనీల్లో వారి పెట్టుబడులు తప్పనిసరిగా నిర్దిష్ట స్థాయిలో ఉండేలా చూసేందుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నాయి. అయితే, ఐపీవోల తర్వాత ప్రమోటర్లు బల్క్, బ్లాక్ డీల్స్ కుదుర్చుకునే ధోరణి పెరుగుతోందని, ఇన్వెస్టర్లు దీనిపై ఓ కన్నేసి ఉంచాలని పరిశ్రమ వర్గాలు వివరించాయి. మరోవైపు, ఐపీవో పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉన్నంత మాత్రాన ప్రతికూలాంశంగా భావించనవసరం లేదని తెలిపాయి. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ పెట్టుబడులు ఉన్న సంస్థల్లో ఇది సాధారణమేనని వివరించాయి. ప్రారంభ దశలో రిస్క్ క్యాపిటల్ భారీగా అవసరం అవుతుందని, ఆ నిధులను సమకూర్చిన పీఈ, వీసీలు తర్వాత దశలో ఐపీవోల్లో ఓఎఫ్ఎస్ కింద వాటాలను విక్రయించుకుంటాయని పేర్కొన్నాయి.




## బజాజ్ ఫైనాన్స్ రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ, నవంబర్ 8: నాన్-బ్యాంకింగ్ సేవల సంస్థ బజాజ్ ఫైనాన్స్ భారీ వృద్ధిని నమోదు చేసుకున్నది. ఈ పండుగ సీజన్‌లో సంఖ్యాపరంగా చూస్తే 27 శాతం వృద్ధిని సాధించిన సంస్థ..విలువ పరంగా చూస్తే మాత్రం 27 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్టు ప్రకటించింది. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 26 వరకు రూ.63 లక్షల రుణాలను మంజూరు చేయగా, అలాగే కొత్తగా 23 లక్షల మంది కస్టమర్లను ఆకట్టుకున్నట్టు కంపెనీ చైర్మన్ సంజీవ్ బజాజ్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు, ఆదాయ పన్నులో భారీ మార్పులు చేయడం దేశంలో వినియోగ-ఆధారిత ఉత్పత్తులకు గిరాకీ నెలకొన్నదన్నారు.



## ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయం రూ. 656 కోట్లు
### క్యూ2లో అత్యధికంగా 375 వాహనాల డెలివరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం ఎంఈఐఎల్ గ్రూప్‌లో భాగమైన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 656.62 కోట్ల ఆదాయం ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 523.70 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 25 శాతం అధికం. లాభం రూ. 47.65 కోట్ల నుంచి 4 శాతం వృద్ధితో రూ. 49.43 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో 375 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివర్ చేశామని, వీటిలో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు కూడా ఉన్నాయని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ మహేష్ బాబు చెప్పారు. ఒక త్రైమాసికంలో ఇదే అత్యధికమని వివరించారు. కంపెనీ ఇప్పటివరకు 3,254 వాహనాలను అందించింది. 9,818 వాహనాలకి ఆర్డర్లతో భవిష్యత్ వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్నట్లు మహేశ్ బాబు చెప్పారు. నిర్వహణ సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టడమనేది ఇటు ఆదాయం, లాభదాయకత వృద్ధికి దోహదపడినట్లు తెలిపారు. అటు దేశీయంగా ఎలక్ట్రిక్ బస్ సెగ్మెంట్లో తొలిసారిగా తమ బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కి సర్టిఫికేషన్ లభించినట్లు వివరించారు. వచ్చే త్రైమాసికం నుంచి ఈ టెక్నాలజీతో బస్సుల తయారీ ప్రారంభమవుతుందని మహేశ్ బాబు తెలిపారు. అర్ధ సంవత్సరానికి గాను కంపెనీ ఆదాయం రూ. 837.61 కోట్ల నుంచి 20 శాతం వృద్ధితో రూ. 1,003.85 కోట్లకు చేరింది. లాభం రూ. 71.91 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ. 75.46 కోట్లకు చేరింది.



## ఘనాలో సింగరేణి పెట్టుబడులు!

రాష్ట్రానికి చెందిన ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణి..అంతర్జాతీయంగా తన వ్యాపార విస్తరణను వేగవంతం చేయబోతున్నది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలు దేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన సంస్థ..తాజాగా ఘనా దేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అక్కడ పెట్టుబడులు పెట్టేయోచనలో ఉన్నది. తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని సింగరేణి సంస్థను ఆ దేశం ఆహ్వానించింది కూడా. హైదరాబాద్ పర్యటనలో భాగంగా శనివారం ఆ దేశ ప్రతినిధుల బృందం సింగరేణి సీఎండీ ఎన్ బలరాంతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రపంచంలో వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీసు, లిథియం వంటి ఉత్పత్తులకు ప్రముఖ దేశంగా పేరొందిన ఘనాలో పెట్టుబడులు పెట్టే విషయంపై వచ్చే నెల రోజుల్లో కంపెనీ అధికారుల బృందాన్ని ఆ దేశానికి పంపిస్తామని బలరామ్ చెప్పారు. సీఎండీని కలిసిన వారిలో ఘనా దేశ ప్రతినిధులు అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, అహ్మద్ ఉమర్ సాండా, మైకెల్ మహోమ, మెగ్త్రారి హుడు, అగ్రే ఎలిషమా ఫ్రెడరిక్ ఉన్నారు.

**50 లక్షల ప్రమాద బీమాను వర్తింపజేయండి**

సింగరేణి ఒప్పంద కార్మికుల ప్రమాద బీమాను రూ. 50 లక్షలు అందించాలని బలరాం పలు బ్యాంకు అధికారులను కోరారు. ఉద్యోగుల సహజ మరణానికి రూ. 20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ ఇచ్చే విషయంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. శనివారం సింగరేణి భవన్‌లో పలు బ్యాంకు అధికారులతో సీఎండీ సమావేశమయ్యారు. ఆయా అంశాలపై బ్యాంకర్లు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.